ఇన్నేళ్ళుగా మరో ఆడమనిషిని తను చూసెరగడు.

ఇంత పెద్ద బిల్డింగ్‌లో ఒక్క సర్వెంట్  మెయిడ్ కూడా ఎందుకో లేదు.

సిద్ధార్థ మెదడులో కొచ్చిన పురుగులాంటి ప్రశ్న తోటమాలి రఘువీర్ తనకొతురుందని, ఆ కూతురు పేరు ఆరతి అని చెప్పినప్పటి నుంచీ అతడిని ఆ ఆలోచన తొలిచేస్తోంది. నిన్నటి సాయంత్రమే-

ఆ ఆలోచనతోపాటు ఇంకో ఆలోచన ప్రవేశించిందతనిలో అప్పటినుంచీ అతను నిలవలేకపోతున్నాడు.

ఐ  బాంబ్ టు సీ..........అరతి......ఆరతిని చూడాలి.  ఆరతితో పాటు యీ వూరుని చూడాలి. ప్రజలను చూడాలి......వీలైతే రోడ్డు మీద నడవాలి.  (సిద్ధార్థ అర్డినరీ రోడ్డు మీద నడవడం చాలా అరుదు) రోడ్డు పక్కన కిరాణ షాపులో చాక్‌లెట్లు కొనుక్కొని తినగలడా తను? ఐస్ క్రీమ్ తినగలదా తను?

తనుండే ప్రదేశాని దగ్గర్లోనే వాటర్ ఫాల్స్ వున్నాయి.  ఆ వాటర్ ఫాల్స్‌లో వున్నాయి ఆ వాటర్ ఫాల్స్ నీళ్ళలో తడుస్తూ గంటల తరబడి స్నానం చేయాలని వుంది.

తనకొచ్చే వింత వింత ఆలోచనలకు తనే ఆశ్చర్యపోతున్నాడు సిద్ధార్థ

గోడగడియారంవైపు చూశాడు అతను.  మధ్యాహ్నం రెండు గంటలు దాటింది.

టైమ్‌టేబుల్ ప్రకారం రెండు గంటలనుంచి, నాలుగు గంటల వరకూ తనకు రెస్టు......

గత కొన్ని రోజులుగా ఆ సమయాన్ని ఆలోచనలకు వెచ్చిస్తున్నాడు అతను ఎక్కడివాళ్ళక్కడ రెస్టు తీసుకునే సమయం.  కాబట్టి ఎవరి దృష్టీ తన మీద వుండదు.

నెమ్మదిగా బెడ్‌మీంచి లేచి, వెనకనుంచి మెట్లుదిగి గార్డెన్లోకి అడుగుపెట్టాడు అతను.

దూరంగా హిమాలయాల మీదనుంచి మబ్బులు, మంచు ముద్దల్లా భారంగా కదులుతున్నాయి. అతని కళ్ళు, రఘువీర్ కోసం వెళుతున్నాయి. బిల్డింగ్ కున్న గోడ దగ్గరకు వచ్చేశాడు.  అటూ ఇటూ చూస్తున్న సిద్ధార్థ చెట్టు కింద నిద్రపోతూ-

రఘువీర్ కనిపించాడు.

అడుగుల చప్పుడికి, గాభరాగా కళ్ళిప్పాడు రఘువీర్.

“ఏం బాబూ..........మళ్ళీ వచ్చావ్?” ప్రేమగా అడిగాడు రఘువీర్.

“నన్ను బయటకు తీసికెళ్ళవా?” గుసుగుసగా అడిగాడు సిద్ధార్థ.

ఒక్కసారిగా భూకంపం వచ్చినట్టు కంగారుపడ్డాడు రఘువీర్.

“ఈ మాట.....నువ్వు నా దగ్గర అన్నావని తెలిస్తేనే ఉద్యోగంలోంచి నన్ను తిసేస్తారు........ఇంకెప్పుడూ ఇలాంటి మాటలు అనకు..........బాబూ.........”

“మరి......”

“ఇలాంటివన్నీ మీ డాడీని నువ్వు అడగాలి.”

"డాడీ ఒప్పుకోడు......పోనీ మీ అరతిని ఒక్కసారి ఇక్కడకు తీసుకురావా........చూస్తాను......ఇక్కడ ఆడపిల్లలెలా వుంటారో చూస్తాను.

అతని అమాయకత్వానికి నవ్వుకున్నాడు రఘువీర్.

ఆ బాబుని ఇంత కట్టుదిట్టాల మధ్య పెంచి, పిచ్చివాడిని చేస్తున్నారు. ఆఖరికి ఇతగాడు గొప్ప బిజినెస్ మేన్ కాదు గొప్ప మాడ్ మేన్ అవుతాడు. మనసులోనే జాలిపడ్డాడతను.

"అరతిని ఇక్కడకు తీసుకురావడం అసాధ్యం బాబూ!"

పది నిమిషాలు గడిచాయి

"ఏదో ఒకరోజు నేను బయటికెళ్ళిపోతాను చూడు. అప్పుడు మీరందరూ విలవిల్లాడిపోతారు" కోపంగా అనేసి-

"పోనీలే బయట ప్రపంచంలోని విశేషాలు చెప్పు" అని అడిగాడు ఆసక్తిగా.

"ఏం విశేషాలు?"

"అదే........ఏసి. లేకుండా ఆరుబయట పడుకునే వాళ్లు. కార్లల్లో కాకుండా మామూలుగా తిరిగేవాళ్లు. బస్సుల్లో ప్రయాణం చేసే వాళ్లు......అలాంటి వాళ్ళ గురించి."

"నీకు మామూలు ప్రజల గురించి ఏమీ తెలీదా?" ఆశ్చర్యంగా అడిగాడు రఘువీర్.

"తెలీదు!"

రఘువీర్ చెప్పడం ప్రారంభించాడు.

"ప్రపంచమ్లో ధనవంతులు మాత్రమే వుండరు. పేదజనం.......మధ్య తరగతి మనుషు...... ప్రధానంగా మూడు రకాల ప్రజలతో యీ ప్రపంచంలో నిండి వుంది. బాగా ధనవంతులున్నట్టే, బాగా పేదవాళ్లు కూడా ఇక్కడుంటారు."

"బాగా పేదవాళ్ళంటే?"

"తినడానికి తిండిలేక, వుండడానికి ఇల్లు లేక, కట్టుకోడానికి బట్టల్లేక నిరంతరం జబ్బులతో, బాధలతో, సమస్యలతో పొట్టకూటికోసం పనులు చేస్తూ, పనులు చేతకానివాళ్ళే దొంగతనాలు చేస్తూ, మోసం చేస్తూ, ఆడవాళ్ళయితే వ్యభిచారం చేస్తూ, అడుక్కుంటూ......హత్యలు, ఖూనీలు దుర్మార్గులు చేస్తూ పోలీసులకు దొరికిపోయి, పట్టుబడి, జీవచ్ఛవాలుగా బ్రతుకుతూ" చెప్పుకుపోతున్నాడు రఘువీర్.

వళ్ళంతా కళ్లు చేసుకుని వింటున్నాడు సిద్ధార్థ.

"నువ్వు చెప్తున్న వాళ్ళెవరికీ ఏ.సి. కార్లు, పర్సనల్ ఫ్లయిట్స్ ఇవ్వేవీ వుండవా?"

సిద్ధార్థ పరిస్థితిపై నిజంగా జాలేసింది రఘువీర్‌కు

ప్రపంచజ్ఞానం లేని విద్య శూన్యంతో సమానమనే విషయం జ్ఞాపకానికొచ్చిందతనకి.

ఎన్నో విషయాలు తెలిసిన మహంత కొడుకు విషయంలో ఈ తప్పెందుకు చేస్తున్నాడు? అపురూపమైన శిల్పంగా మలచబోయి, తనకు తానే చేతులారా శిలగా, బండరాయిగా అతడికి ఎందుకు తయారుచేస్తున్నాడు మహంత?

ఇంకేదో చెప్పడానికి పెదవి విప్పిన రఘువీర్ చెట్టు చాటున కనిపించిన వ్యక్తిని చూసి ఆకులా వణికిపోయాడు. ఆ వ్యక్తి అనంతమూర్తి.

భయంగా లేచి నిలబడ్డాడు రఘువీర్.

అనంతమూర్తిని అక్కడలా చూసిన సిద్ధార్థ నోట మాట రాకుండా నిల్చుండిపోయాడు.

"కమాన్ ఫాలోమీ" అంటూ నడిచాడు అనంతమూర్తి. అతని వెనక పిల్లిలా సిద్ధర్థా.

బెడ్ రూమ్ కి చేరుకున్న సిద్ధార్థ నిద్రపోవడం లేదు. తన పరిస్థితిని తలచుకుని కుములిపోతున్నాడు.

చేతికందిన వస్తువుని తీసి గోడకు విసిరికొడుతున్నాడు. సౌండ్ ప్రూఫ్ కావడం వల్ల ఆ గదిలోంచి శబ్దం బయటకు రావడంలేదు.

నేనిక్కడనుంచి తప్పించుకుంటాను.

నేనిక్కడనుంచి దూరంగా పారిపోతాను.

నేను మామూలు మనుషుల్లో మనిషిగా తిరుగుతాను....

అడుకుంటాను.......పాడుకుంటాను...........

నేను గ్రేట్ బిజినెస్‌మేన్ కాను. నాకు ఏ ఏంపైర్ అఖ్ఖర్లేదు.

ఐ విల్ త్రో ఇట్ ఆఫ్ విత్ మై ఫుట్.

ఆ బంగారు పంజరంలోంచి-

ఎలా తప్పించుకోవాలో ఆలోచిస్తున్నాడు సిద్ధర్థ.

తను ఈ బిల్డింగ్‌లోంచి బయటికెళ్తాడు బయటకెళ్ళిన తర్వాత ఎక్కడికెళ్తాడు?

కారు వుండదు. కాలి నడకన వెళ్ళాలి. ఎలా వెళ్ళాలి?

చాల సేపు-

ఆలోచిస్తూనే వున్నాడు సిద్ధార్థ. తను ఒక్క నిమిషం ఈ బిల్డింగ్‌లో లేకపోతే జరిగే ఉపద్రావాన్ని వూహించలేకపోతున్నాడు సిద్ధార్థ.

తనిక్కడనుంచి తప్పించుకుంతానన్న ఆలోచనతో ఆనందంగా నిద్రపోయాడు సిద్ధార్థ.

అప్పటికి రాత్రి రెండు గంటలు దాటింది.

* * * * * * * * * * *

ఏ.సి సూట్లో కూర్చున్నా, నిప్పుల కుంపటి పక్కనున్నట్టుగా వుంది నిశాంతకు రెండు గంటల క్రితం జరిగిన సంఘటన వాస్తవమా? అనుభవమా?

ఆ సంఘటన దేశ్‌ముఖ్ తనకు పెట్టిన పరీక్ష అని తెలుసుకోడానికి ఆమెకు ఎంతో సేపు పట్టలేదు.

అనుభవపూర్వకంగా తెల్సుకుందామె.

అతని ముఖం వైపే దీర్ఘంగా చూస్తూ ఆలోచిస్తోంది నిశాంత.

కానీ అతను నిశాంత వైపు చూడటంలేదు ఆ రూమ్‌లో వున్న ఇంకో వ్య క్తి వైపు చూసి, అతను తెచ్చిన ఫైలుని తిరగేస్తున్నాడు.

ఆ వ్య క్తి పేరు మనోహర్!

దేశ్‌ముఖ్ కున్న కంపెనీల్లో ఒక కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్.

ఆ ఫైల్‌ని ఒకసారి తిరగేసి చూసి.

"నారాయణదత్ ఇలా చేశాడంటే నేను నమ్మలేకపోతున్నాను........"
బాధ ధ్వనించింది. దేశ్‌ముఖ్ ముఖంలో.

"నేనూ మీలాగే అనుకున్నాను ఎన్నాళ్ళనుంచి చేస్తున్నాడో తెలీదు. దొరికిపోయాడు ముగ్గురు సెక్యూరిటీ గార్డుల్ని నేనే సస్పెండ్ చేశాను. నారాయణదత్ విషయం మీకు చెప్పి చేద్దామని......" అన్నాడు మనోహర్.

"ఓ.కె మార్నింగ్ నేను ఫోన్ చేస్తాను"

ఆయన నోటివెంట ఆ మాట రాగానే లేచి నిలబడి, నమస్కరించి ఆ రూమ్‌లోంచి బయటికివెళ్ళిపోయాడు మనోహర్.

"ఏమిటి సార్? మీ కంపెనీలో ప్రాబ్లమా?" సోఫాలోంచి లేస్తూ అడిగింది నిశాంత.

"డబ్బు విశ్వాసాన్ని మింగేస్తుంది" నెమ్మదిగా అన్నాడాయన.

"ఇంతకీ ఏమైంది సార్?"

"నారాయణదత్ నాస్టీల్ ఇండస్ట్రీచీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్........! పాతికేళ్ళుగా నా దగ్గర పనిచేస్తున్నాడు. అర్డినరీ సెక్యూరిటీ గార్డు స్థాయి నుంచి సెక్యూరిటీ ఆఫీసర్ వరకూ వచ్చాడు. కానీ అయిదేళ్ళుగా కంపెనీ స్క్రాప్(పనికిరాని చిత్తు)ని బయట పారేయిస్తున్నానని చెప్పి, అమ్మేసుకుని డబ్బు చేసుకుంటున్నాట్ట.......! ఆ డబ్బు లక్షల్లో వుందట రియల్లీ హిఈజ్ సిన్సియర్! ఎందుకిలా చేశాడు?" పచార్లు చేస్తూ అన్నాడు దేశ్‌ముఖ్.

"అతనితో కూడా ఒకసారి మాట్లాడి చూడండి......." నారాయణదత్ ఫైల్‌ని చూస్తూ అంది నిశాంత.

"రెడ్ హేండెడ్‌గా దొరికిపోయాడు కంచే చేను మేయడంమంటేయితే........! బద్ధకాన్ని సహించొచ్చు కానీ.......బాధ్యతారాహిత్యాన్ని సహించగూడదు. అందులోనూ ఇది నమ్మకద్రోహం........" ఈ మాట అంటున్నపుడే అయన నారాయణదత్‌ని టెర్మినెట్ చేయాలనే నిర్ణయానికొచ్చేశాడు. టెలిఫోన్ వైపు నడిచాడు.

ఆ విషయాన్ని కొన్ని క్షణాల్లోనే గ్రహించిన నిశాంత-

"ఒక్క నిమిషం సార్! మీరేమనుకోకపోతే నాదో సలహా......"

టెలిఫోన్ రిసీవర్ అందుకున్న ఆయన నిశాంత వైపు చూశాడు ఆశ్చర్యంగా.

"స్క్రాప్ అంటే చెత్త! అంటే మీరందరూ చెత్తగా సర్టిఫై చేసిన చెత్త! అవునుగదా"

"ఎస్......"

"పనికి రాని చెత్తను అమ్ముకుని అతను లక్షలు సంపాదిస్తున్నాడని అభియోగం అవునా?"

"అవును"

ఆ చెత్త కంపెనీ నుంచి బయటికెళ్ళాక ఏమవుతుందో మీకనవసరం కాబట్టి ఇన్నాళ్లూ పట్టించుకోలేదు. ఇప్పుడెందుకు పట్టించుకుంటున్నారు? మీరంటే మీరు కాదు, మీ ఎం.డి........ఇన్నాళ్ళూ మీ ఎం.డి ఏం చేశాడు? ఇప్పుడే ఆ విషయం మీకెందుకు కంప్లైంట్ చేయాల్సి వచ్చింది? ప్లీజ్ థింకిట్ యాజ్ ఎ పాయింట్."

అశ్చర్యంగా చూశాడు ఆయన. ఆ ఆర్గ్యుమెంటు అతనికి బాగానచ్చింది.

"పారవేస్తున్న చెత్తలో డబ్బున్న విషయం నారాయణ్‌దత్ గుర్తించాడు గానీ ఎం.డి. మనోహర్ ఎందుకు గుర్తించలేదు.?"

"అంటే ........నువ్వేమంటావ్?"

"ఇప్పటివరకూ మీరు తీసుకునే ఆఫీషియల్స్ డెసిషన్స్ ఎలా వుంటాయో నాకు తెలీదు. నేనైతే నారాయణ్‌దత్‌ని సపోర్టు చేస్తాను.........."

చెప్పి అతని ముఖంలోకి చూసింది నిశాంత.

"నీ డెసిషన్ చెప్పు ఫర్వాలేదు"

"పాతికెళ్ళుగా ఒక కంపెనీలో పనిచేస్తున్న వ్యక్తి అకస్మాత్తుగా స్వార్థపరుడుగా తయారయ్యాడంటే, అందుకు ప్రధానమైన కారణం అసంతృప్తి! మేనేజ్‌మెంటు తన సేవల్ని గుర్తించలేదనే అసంతృప్తి! అతను తృప్తి! మేనేజ్‌మెంటు తన సేవల్ని గుర్తించలేదనే అసంతృప్తి! అతను ఎదిగాడు. ఆ ఎదుగుదలను గుర్తించడంలో యాజమాన్యం విఫలమైంది.

అదే కాకుండా మీ ఎం.డి ఇన్నాళ్ళూ ఏమ చేస్తున్నాడు? స్క్రాప్‌లోంచి కూడా డబ్బును సృష్టించొచ్చనే విషయం ఆయనెందుకు గమనించ లేదు? సెక్యూరిటీ ద్వారా స్క్రాప్ బయటికెళ్తుంది బయటికి కెళ్తుంది తప్ప, స్క్రాప్ మీరు ఇన్‌ఛార్జి ఏం చేస్తున్నాట్టు? నిశితంగా ఆర్గ్యూ చేయగలదనే విషయం మొట్టమొదట తెలిసింది దేశ్‌ముఖ్‌కి

"అంటే మెటీరియల్ ఇన్‌ఛార్జీని, జనరల్ మేనేజర్ని, సెక్యూరిటీ ఆఫీసర్ని ముగ్గురినీ సస్పెండు చెయ్యమంటావ్. అంతేనా?"

"కాదు"

"మరి?"

"ఎం.డి. మనోహర్‌ని......! ఎందుకంటే.... ఇన్నాళ్ళ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించింది

ఎం.డి తప్పు. సెక్యూరిటీ ఆఫీసర్ నారాయణ్ దత్‌కాదు. బైదిబై...........మీరు నాకు పర్మిషన్ యిస్తే మీ ఆఫీసుకి నేను ఫోన్ చేస్తాను."

ఎందుకని ప్రశ్నించలేదాయన.

ఫోనందుకుని నేరుగా పర్సనల్ ఆఫీసర్‌కి ఫోన్ చేసింది నిశాంత. తనను తాను కొత్తగా అపాయింట్ అయిన పి.ఎ. టు ఛైర్మన్ అని పరిచయం చేసుకుని-

సెక్యూరిటీ ఆఫీసర్ నారాయణ్‌దత్‌కు సంబంధించిన వివరాలను అడిగింది.

రెండు నిమిషాల తరువాత పర్సనల్ ఆఫీసర్ చెప్పడం ప్రారంభించాడు.

"ఒరిజినల్ నారాయణ్‌దత్ స్ట్రిక్ట్ అండ్ సిన్సియర్ మేడమ్........."

తను ఎక్స్‌టెన్షన్ ఫోన్ రిసీవర్ని అందుకని అతను చెప్పే మాటలను వింటోంది.

పర్సనల్ ఆఫీసర్ చెబుతున్నది వింటున్నాడు దేశ్‌ముఖ్.

"ఎం.డి. మనోహర్, నారాయణ్‌దత్ ఫ్రెండ్స్‌గా వున్నంతకాలం అంతా బాగానే జరిగిపోయింది మేడమ్!"

"మరీ వేళ నారాయణ్‌దత్‌ని సస్పెండ్ చేయడానికి ఎం.డి. ఎందుకు పూనుకున్నాడు?" ఎక్స్‌టెన్షన్ ఫోన్లోంచి అడిగింది నిశాంత

"తనకెంత సర్వీసున్నా, ఆ సర్వీస్‌ని ఛైర్మన్ గుర్తించలేదన్న కోపంతో, ఎం.డితో నారాయణ్‌దత్ చెయ్యి కలిపినా, బేసికల్లీ హి ఈజ్ గుడ్ మేడమ్!"

"ఎం.డి కెదురుగా, ఇంత నిక్కచ్చిగా చెబుతున్నారంటే, మీరు నారాయణ్‌దత్ పార్టీయా?" నవ్వుతూ అడిగిందామె.

"మీరెప్పుడు జాయిన్ అయ్యారో నాకు తెలీదు కానీ.....నేనీరోజుతో రిటైరవుతున్నాను....." నవ్వుతూ అనేసి ఫోన్ పెట్టేశాడు ఆ పర్సనల్ మేనేజర్.

దేశ్‌ముఖ్ ముఖం వివర్ణమైపోయింది.

"ఇప్పుడు నన్నేం చేయమంటావో చెప్పు?" గంభీరంగా అడిగాడు దేశముఖ్. నిశాంత తెలివితేటల్ని పరీక్షించాలనే అలా అడిగాడాయన.

"నా నిర్ణయం కటువుగా వుంటుంది" ఆత్మవిశ్వాసంతో అంది నిశాంత

"ఫర్వాలేదు చెప్పు?"

"నారాయణ్ దత్‌ని ఎం.డి ని చెయ్యండి" ఆ మాట చెప్పి దేశ్‌ముఖ్ చేతిలో ఫైలు వుంచింది.

మూడు నిమిషాలసేపు గదిలో పచార్లు చేశాడు దేశ్‌ముఖ్.

వెంటనే సి. ఎ. సుభాష్‌చంద్రను పిలిచాడు. నారాయణ్‌దత్‌ను మేనేజింగ్ డైరెక్టర్‌ను చేస్తూ లెటర్ డిక్టేట్ చేశాడు మనోహర్‌ని అప్పటి కప్పుడే డిస్‌మిస్ చేశాడు.

అనుకోకుండా నిశాంత ఒక టెస్ట్‌లో నెగ్గింది. ఆ విషయం నిశాంతకు తెలీదు.

నిశాంత సాల్వ్ చేసిన ప్రాబ్లమ్స్, రియల్ ప్రాబ్లమ్ కాదు నిశాంత మేథస్సును, టెస్ట్ చెయ్యడానికి దేశ్‌ముఖ్ సృష్టించిన ప్రాబ్లమ్. నిశాంత మధ్యలో ఫోన్ చేయగా మాట్లాడింది పర్సనల్ ఆఫీసర్ కాదు పి.ఎ. సుభాష్‌చంద్ర.

అంతా ఒక డ్రామా. స్లమ్ ఏరియాలోది మొదటి భాగమైతే, ఇది రెండో భాగం.

* * * * * * * * * *

న్యూయార్క్.

ఒలింపిక్ టవర్ ఎపార్ట్‌మెంట్. యాభై అంతస్తుల విశాల భవనం అది.

వాటిల్లో రెండు ఫ్లోర్లు పూర్తిగా మహంత రెసిడెన్స్-బిజినెస్ డీలింగ్స్ కోసం వచ్చే ఏజెంట్లతో చర్చలకోసం ఈ రెసిడెన్స్‌ను వుపయోగిస్తాడు మహంత

మొదటి ఫ్లోర్లో రెండు రాయల్ సూట్స్, స్విమ్మింగ్ ఫూల్, పారిస్ యువతులు స్వాగత, సత్కారాలు చేసే బార్ ప్రత్యేకతలు కాగా, రెండో ఫ్లోర్ పూర్తిగా మహంత పర్సనల్.